సాక్షి అనకాపల్లి

ఆదివారం । 18 । మే । 2025

గోవాడ సుగర్స్‌ను ఆదుకోవాలి

చోడవరం: గోవాడ సుగర్ ఫ్యాక్టరీని ప్రభుత్వం ఆదుకోవాలని ఫ్యాక్టరీ కార్మికుల రైతులు, కార్మికుల ఐక్య పరిరక్షణ సమితి సమావేశం కోరింది. గోవాడ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఫ్యాక్టరీ చెరకు రైతులు, సుగర్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ కార్మిక సంఘం సమావేశం శనివారం నిర్వహించారు. ఫ్యాక్టరీ సమస్యలపై సీఎం, డిప్యూటీ సీఎంలకు వినతి పత్రం ఇవ్వాలని నిర్ణయించారు. రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన రుణాలను ప్రభుత్వం ఈక్విటీగా మార్పు చేయాలని డిమాండ్ చేశారు. ఫ్యాక్టరీ ఆస్తులను రీ వాల్యువేషన్ చేయించి ప్రభుత్వ గ్యారంటీతో వడ్డీ లేని రుణాన్ని మంజూరు చేయాలని, గతంలో మాదిరిగానే బ్సిడీపై చెరకు దవ్వ, ఎరువులు రైతులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. 2025–26 రానున్న క్రషింగ్ సీజన్‌కు వర్కింగ్ క్యాపిటల్ నిమిత్తం, ప్రస్తుతం రైతులకు, కార్మికులకు బకాయిలు చెల్లించడానికి అవసరమైన నిధులు ప్రభుత్వం మంజూరు చే యాలని సమావేశంలో తీర్మానించారు. ప్రభుత్వానికి ఫ్యాక్టరీ సమస్యలు, ఆదుకోవాలనే డిమాండ్లతో వినతిపత్రంపై చెరకు రైతుల సంతకాల సేకరణ ప్రారంభించారు.



సంతకాల సేకరణ ప్రారంభించిన రైతులు

తల్లిదండ్రుల చెంతకు చిన్నారి

- కిడ్నాప్ కేసును ఛేదించిన పోలీసులు
- పిల్లల దొంగల ముఠా అరెస్టు



ఆనందంతో కుమార్తెను ముద్దాడుతున్న తల్లి లలిత, పక్కన తండ్రి హరీష్

అనకాపల్లి టౌన్: నాలుగు రోజుల క్రితం తప్పిపోయిన కుమార్తె కనిపించడంతో ఆ తల్లి ఆనందానికి హద్దులు లేవు. పాపను ఎత్తుకొని ముద్దాడింది. సంతోషంతో కన్నీళ్లు పెట్టుకుంది. కలకలం సృష్టించిన చిన్నారి కిడ్నాప్ కేసును పోలీసులు చాకచక్యంగా ఛేదించారు. తల్లీబిడ్డలను ఒక్కటి చేశారు. అనకాపల్లి లోకవారి వీధిలో నివసిస్తున్న కశింకోట మండలం గవరపేట వీధికి చెందిన కూలీ దంపతులు భీశెట్టి హరీష్, లలిత ఈనెల 14న పనిలోకి వెళ్లాక వారి నాలుగేళ్ల చిన్నారి లోహిత కనిపించకుండా పోయిన విషయం తెలిసిందే. మర్నాడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీఐ విజయకుమార్ నేతృత్వంలో ఎస్సైలు సత్యనారాయణ, ఈశ్వర్‌రావు, వెంకటేశ్వరరావులు, సీసీఎస్ ఎస్‌ఐలు అశోక్‌కుమార్, స్వామినాయుడు, అప్పలరాజు ఆరు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి దర్యాప్తు ప్రారంభించారు. సీసీ కెమెరాల సాయంతో నిందితుల కదలికలను కనిపెట్టారు.



కిడ్నాపర్‌ను అనుసరిస్తున్న బాలిక (సీసీ ఫుటేజ)

చాక్లెట్ ఆశ చూపించి..

సీసీ కెమెరాల పుటేజీని పరిశీలిస్తే.. ఆశ్చర్యకరమైన విషయాలు వెలుగుచూశాయి. చిన్నారి ఒక మహిళను అనుసరిస్తూ వెళ్లింది. డెయిరీ మిల్క్ చాక్లెట్ ఇచ్చి, మరి కొన్ని చాక్లెట్లను చూపించి, నిందితురాలు బాలికను ఆకర్షించింది. పెరుగుబజార్‌లో బాలికతో కలిసి అనకాపల్లి–విశాఖ 500 నెంబర్ గల ఆర్టీసీ బస్సులో 14వ తేదీ సాయంత్రం 5.50 గంటలకు వెళ్లినట్టు పోలీసులు గుర్తించారు. ఫేస్ ఐడెంటిఫికేషన్‌తో మహిళ ఫోన్ నంబర్‌ను కూడా పోలీసులు కనుగొన్నారు. వెంటనే మహిళ ఫోటోను స్థానిక వాట్సాప్ గ్రూపుల్లో షేర్ చేసి ఆమెను గాజువాకలో పెందగంట్యాడ నివాసి టొంటోని లక్ష్మిగా గుర్తించారు. పోలీస్ బృందాలు గాలింపు చర్యలు చేపడుతున్న సమయంలో నిందితులు టొంటోని లక్ష్మి, ఆమె భర్త టొంటోని అప్పలస్వామి బాలికతో కలిసి బొలెరో వాహనంలో అనకాపల్లికి చెందిన బోనాలా దేవిని కలవడానికి అనకాపల్లికి వస్తుండగా.. జలగలమదుం జంక్షన్ వద్ద అనకాపల్లి టౌన్ పోలీసులు అరెస్టు చేశారు.

వివరాలు వెల్లడించిన ఎస్పీ

సంచలనం సృష్టించిన మిస్సింగ్ కేసు వివరాలను ఎస్పీ తుహిన్ సిన్హా శనివారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. అనకాపల్లికి చెందిన బోనాల దేవి సూచనలతో గాజువాకకు చెందిన టొంటోని లక్ష్మి అనకాపల్లి వచ్చి పాపను మాయం చేసిన విషయం గుర్తించామన్నారు. నిందితులు ముగ్గురినీ విచారించగా పాపను విక్రయించడానికి ప్రయత్నించినట్లు అంగీకరించారని తెలిపారు. మిస్సింగ్ కేసును కిడ్నాప్ కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. నిందితురాలు లక్ష్మి విశాఖ పోలీస్ కమిషనరేట్ పరిధిలో కిడ్నీ రాకెట్ కేసులో ఉన్నట్లు ఎస్పీ వెల్లడించారు. నిందితుడు టొంటోని అప్పలస్వామి రిజర్వ్ పోలీస్ కానిస్టేబుల్‌గా పనిచేసి రిటైర్ అయ్యాడు. మిస్సింగ్ కేసును ఛేదించిన పోలీసులను ఎస్పీ తుహిన్ సిన్హా అభినందించారు. అదనపు ఎస్పీ ఎం.దేవప్రసాద్, ఇన్‌చార్జ్ డీఎస్పీ బి.మోహన్‌రావు, టౌన్ సీఐ టీవీ విజయ్‌కుమార్ బృందానికి నగదు రివార్డు, ప్రశంసా పత్రాలు అందజేశారు.



మీడియాతో మాట్లాడుతున్న ఎస్పీ తుహిన్ సిన్హా

ఒక్కో పోస్టుకు 43 మంది పోటీ

విశాఖ విద్య: మెగా డీఎస్సీకి దరఖాస్తు గడువు ముగిసింది. చాలా కాలం తర్వాత వెలువడిన నోటిఫికేషన్ కావడంతో ఉపాధ్యాయ పోస్టు సాధించేందుకు శిక్షణార్థులు భారీగా పోటీపడుతున్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలోని అన్ని మేనేజ్‌మెంట్లలో 1,139 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ వెలువడింది. మొత్తం 29,779 మంది అభ్యర్థులు 49,658 దరఖాస్తులు చేసుకున్నారు. ఈ సారి డీఎస్సీకి పోటీ తీవ్రంగానే ఉండనుంది. అంటే ఒక్కో పోస్టుకు 43 మంది పోటీపడుతున్నారు. ఎలాగైనా కొలువు సాధించాలనే లక్ష్యంతో ప్రిపరేషన్‌లో ఉన్న అభ్యర్థులు అర్హతలను బట్టి ఆయా సబ్జెక్టులకు దరఖాస్తు చేసుకున్నారు.

సమయం తక్కువ.. ఒత్తిడి ఎక్కువ

డీఎస్సీ పరీక్షలు జూన్ 6 నుంచి జూలై 6 వరకు జరగనున్నాయి. మరో 20 రోజుల్లో పరీక్షను ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఇదే ఇప్పుడు డీఎస్సీ ప్రిపరేష**న్‌లో ఉన్న అభ్యర్థులకు టెన్షన్ కలిగిస్తోంది. సమయం పెంచి, అందరికీ ఒకే రోజు పరీక్ష నిర్వహించాలని అభ్యర్థులు డిమాండ్ చేస్తున్నా.. ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదు. దీం**తో రేయింబవళ్లు పుస్తకాలతో అభ్యర్థులు కుస్తీ పడుతున్నారు.

భర్తీ కానున్న పోస్టులు ఇవే..

ఉమ్మడి విశాఖ జిల్లాకు సంబంధించి ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల పరిషత్, మున్సిపల్ మేనేజ్‌మెంట్ పరిధిలోని పాఠశాలల్లో 734(ఓపెన్ 290 + ఇతర కేటగిరీల మొత్తం 444) పోస్టులను భర్తీ చేయనున్నట్లు నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. అదే విధంగా గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆశ్రమ పాఠశాలల్లో 400 పోస్టులు ప్రకటించారు. పాఠశాల విద్యాశాఖ పరిధిలోని జువనైల్ హోమ్‌లో 5 ఖాళీలు కలుపుకుని మొత్తంగా ఉమ్మడి విశాఖ జిల్లా పరిధిలో 1,139 పోస్టులు భర్తీ చేయనున్నారు. ఇవి కాకుండా జోనల్ స్థాయిలో ఏపీ రెసిడెన్షియల్/ మోడల్ స్కూల్స్/సోషల్ వెల్ఫేర్/బీసీ వెల్ఫేర్/ట్రైబల్ వెల్ఫేర్(గురుకులాలు) పరిధిలోని విద్యాలయాల్లో జోనల్ ప్రాతిపదికన 400 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేశారు.



పోటీ ఇలా..

ఉమ్మడి విశాఖ జిల్లా ప్రాతిపదికన ఉపాధ్యాయ పోస్టుల భర్తీ జరగనుంది. ఈ నేపథ్యంలో విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లోని విద్యాలయాల్లో సబ్జెక్టుల వారీగా ఉన్న ఖాళీలు, రోస్టర్ వారీగా అందిన దరఖాస్తులు ఇలా ఉన్నాయి.

కేటగిరీ	వచ్చిన దరఖాస్తులు		
ఓసీ	1,626	బీసీ-ఈ	423
బీసీ-ఏ	1,940	ఎస్సీ-1	479
బీసీ-బీ	2,563	ఎస్సీ-2	876
బీసీ-సీ	198	ఎస్సీ-3	2,821
బీసీ-డీ	8,330	ఎస్టీ	10,523
		ఈడబ్ల్యూఎస్	890

వీటితో పాటు పీహెచ్ కేటగిరీలకు దరఖాస్తులకు వచ్చాయి

దరఖాస్తులు ఇలా

మొత్తం అభ్యర్థులు	29,779
సబ్జెక్టుల వారీగా దరఖాస్తులు	49,658
పురుషులు	11,773
మహిళలు	18,006

కళ్ల ముందే కుమారుడి మరణం

- చావుబతుకుల మధ్య తల్లిదండ్రులు
- జాతీయ రహదారిపై మృత్యుఘోష

సబ్బవరం: సబ్బవరం మండలం చిన్నపాలెం సమీపంలో అనకాపల్లి–ఆనందపురం జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదం ఆ నిరుపేద కుటుంబాన్ని ఛిన్నాభిన్నం చేసింది. నాతవరం మండలం నాయుడుపాలెం గ్రామానికి చెందిన నక్కా అప్పలస్వామి, పద్మ దంపతులు ఆనందపురం మండలం గిడిజాల సమీపంలోని నీళ్లకుండీల వద్ద ఓ సిమెంట్ ఇటుక బట్టీలో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. స్వగ్రామంలో జరిగిన బోడ కొండమ్మ పండగలో పాల్గొని, తిరిగి పనికి వెళ్లడానికి తమ తొమ్మిదేళ్ల కుమారుడు మనోజ్తో కలిసి ద్విచక్రవాహనంపై బయలుదేరారు. జాతీయ రహదారిపై చిన్నపాలెం సమీపంలో నిలిచి ఉన్న కోళ్లను తరలించే బొలెరో వాహనాన్ని వారి ద్విచక్రవాహనం ఢీకొట్టింది. ప్రమాద తీవ్రతకు మనోజ్ అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడు. అప్పలస్వామి, పద్మ తీవ్ర గాయాలతో హాహాకారాలు చేశారు. వారిని హుటాహుటిన 108 వాహనంలో కేజీహెచ్‌కు తరలించారు. వారి పరిస్థితి కూడా విషమంగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

వెంటాడుతున్న విషాదం: ఈ కుటుంబంలో ఇది రెండో విషాదం. అంతకుముందు వారి చిన్న కుమారుడు శర్వాన్ సత్యనారాయణ గుండె సంబంధిత వ్యాధితో మరణించాడు. ఒక బిడ్డను వ్యాధితో పోగొట్టుకున్న ఆ తల్లిదండ్రులు, ఇప్పుడు పెద్ద కొడుకును కూడా రోడ్డు ప్రమాదంలో కోల్పోయారు. మనోజ్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రికి తరలించారు. మృతుడు మనోజ్ పెదనాన్న అప్పలకొండ ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ సింహాచలం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



బాలుడి మృతదేహం వద్ద విలపిస్తున్న బంధువులు



పూరిల్లు.. పొదరిల్లు

- తాటాకు ఇంటిపై పెరుగుతున్న మక్కువ
- పల్లెకు వచ్చి సేద దీరుతున్న పట్నవాసులు
- ఫామ్ హౌస్ కల్చర్‌కు ఆదరణ

పక్షుల కువకువలు వినిపించకుండా పోతున్నాయి.. ఆలమందలు కనిపించకుండా పోతున్నాయి.. ప్రకృతి అందాలు కనుమరుగయ్యాయి.. సూర్యుడు కూడా కనిపించనంతటి ఎత్తైన భవనాలు.. ఆ ఇళ్లలో కృత్రిమ బంధాలతో బతుకంటేనే విసుగెత్తే పరిస్థితులు నెలకొన్నాయి. అందుకే మళ్లీ పాత రోజుల వైపు కొందరు వెనుదిరిగి చూస్తున్నారు. ప్రశాంతంగా ఉండాలని కోరుకుంటున్నారు.



ఎన్.గజపతి నగరంలో ఉపాధ్యాయుడు చిరికి శ్రీనివాసరావు కట్టించుకున్న తాటాకు ఇల్లు

మాడుగుల: పట్టణాల్లోని రణగొణ ధ్వనులకు దూరంగా ఉంటే ఎంత బాగుంటుంది! వాతావరణ కాలుష్యం సోకని ప్రపంచానికి దగ్గరయ్యే అదృష్టం దక్కితే ఎంత బాగుంటుంది! ఈ ఊహే ఇప్పుడు అందరినీ పల్లెటూరి వైపు నడిపిస్తోంది. తాతల కాలం నాటి పూరి గుడిసెలంటే కొందరు మక్కువ చూపిస్తున్నారు. పెంకుటిళ్లు, డాబాలు రావడంతో పల్లెల్లో కూడా పూరిళ్లు కనుమరుగయ్యాయి. తాటాకు కమ్ములతో నిర్మించిన ఇళ్లలో వేసవి కాలంలో చల్లదనం.. చలికాలంలో వెచ్చదనం ఉంటుంది. ఎటువంటి అనారోగ్యాలు దరి చేరేవి కావు. రైతులకు పండే దినుసులు దాచుకోవడానికి బాగుండేవి. అయితే అగ్ని ప్రమాదాలకు భయపడి గ్రామాల్లో కూడా డాబాలు నిర్మించుకున్నారు.

తాటి చెట్లు ఏవీ..

రైతు ఉన్న చోట తాటి చెట్టు ఉంటుందన్న సామెత ఇప్పుడు వినిపించకుండా పోయింది. తాటి చెట్లు లేవు, ఆ చెట్లు ఎక్కి, తాటాకులు నరికే వారు కూడా కనుమరుగయ్యారు. అక్కడక్కడ మాత్రమే వీరు దర్శనమిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి ఉద్యోగ రీత్యా, వృత్తి రీత్యా పట్టణాలకు వెళ్లి నివాసముండడంతో అలాంటి వారు అరుదుగా కనిపిస్తున్నారు.

అంతరించిన ఊర పిచ్చుకలు

గ్రామీణ ప్రాంతాల్లో తాటాకు ఇళ్లు ఉండడం వలన తాటాకు పంచ పాలీల్లో ఊర పిచ్చుకలు అధికంగా ఉండేవి. ఇప్పుడు డాబా ఇళ్లు రావడంతో ఆ పిచ్చుకలు అంతరించిపోవడంతో పొలాల్లో చీడపురుగులు పెరిగిపోయి గ్రామీణులు ఇబ్బందులు పడుతున్నారు. ఒకప్పుడు తక్కువ ఖర్చుతో తాటాకు ఇల్లు నిర్మాణం జరిగేది. కానీ ప్రస్తుతం ప్రతి ఏటా తాటాకు నేతకు రూ.30 వేల నుంచి రూ.40 వేల వరకు ఖర్చవుతుంది. తాటి చెట్లు చాలావరకు అంతరించిపోతుండడంతో ఇంటికి వచ్చేసరికి ఒక్కొక్క తాటాకు 10 రూపాయల ధర పలుకుతోంది. పని దొరకక పట్టణాలకు వలస వెళ్లిపోవడంతో తాటాకు నేసే వారు తక్కువయ్యారు.

ట్రెండ్ మారుతోంది..

రానురాను ప్రజల ఆలోచన ధోరణిలో మార్పు కనిపిస్తోంది. కొంతమంది మళ్లీ తిరిగి వారి స్వగ్రామాలకు వచ్చి తాటాకు ఇల్లు నిర్మించుకుని వేసవి సెలవుల్లో సేద తీరుతున్నారు. ప్రస్తుతం ఈ తరహాలోనే ఫామ్‌హౌస్‌లు నిర్మితమవుతున్నాయి. దేవరాపల్లి మండలంలో ఎన్.గజపతినగరం గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు చిరికి శ్రీనివాసరావు ఇప్పటికీ తాటాకు ఇంట్లోనే నివసిస్తున్నారు. మాడుగుల నియోజకవర్గంలో ఈ తరహా ఇళ్లు సుమారు 300 వరకు ఉన్నాయని అంచనా.


తాటాకు ఇల్లంటే ఇష్టం



నా చిన్నతనం నుంచి తాటాకు ఇంటిలోనే నివాసం ఉంటున్నాను. ఎందుకో ఈ వాతావరణం అంటే నాకెంతో ఇష్టం. ఇలాంటి చోట్ల స్వచ్ఛత గోచరిస్తుంది. ఎంతో ఆరోగ్యకరం కూడా. పూరింటిలో వేసవిలో కూడా ఏసీ పెట్టనవసరం లేదు. చల్లగా ఉంటుంది. మేడ ఇల్లు కట్టుకోగలిగే స్తోమత ఉన్నా తాటాకు ఇంటిలోనే నివాసం ఉంటాను. ఇప్పుడు నాలాగే చాలామంది ఆలోచిస్తున్నారు.

–చిరికి శ్రీనివాసరావు, ఉపాధ్యాయుడు, ఎన్.గజపతినగరం

తాటాకు ఇంటికి డిమాండ్



గ్రామాల్లో తాటాకు ఇళ్లు ఉండేటప్పుడు ఊర పిచ్చుకలు ఉండేవి. ఇప్పుడు డాబాలు రావడంతో అవి అంతరించిపోయి నేడు జూలో చూడవలసిన పరిస్థితి దాపురించింది. ధాన్యం, అపరాలు బయట ఆరబోసినప్పుడు గింజల్లో పురుగులు లేకుండా ఏరుకునేవి. నేడు మందులు చల్లినా పురుగులు నశించటంలేదు. అందుకే డాబాలున్నా సరే పక్కన చిన్న తాటాకు ఇల్లు నిర్మించుకుంటున్నారు.


–పాలమేర విజయలక్ష్మి, ఎంపీటీసీ, మాడుగుల

విద్యుత్ వినియోగదారులకు సగం పాలిటెక్నిక్ సీట్లు

- 23 నుంచి దరఖాస్తుల పంపిణీ

కశింకోట: ఆర్‌ఈసీఎస్‌లో ఉన్న రాజీవ్ గాంధీ పాలిటెక్నిక్ కళాశాలలో విద్యుత్ వినియోగదారుల కోటా కింద సగం సీట్లను భర్తీ చేయడానికి ఈ నెల 23 నుంచి దరఖాస్తులు పంపిణీ చేయనున్నట్లు ఆర్‌ఈసీఎస్ ఎండీ జి.ప్రసాద్, కళాశాల ప్రిన్సిపాల్ బి.ఉమాశంకర్ తెలిపారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు కశింకోట, మునగపాక, అనకాపల్లి రూరల్, సబ్బవరం, పరవాడ మండలాలకు చెందిన గృహ, వ్యవసాయ, వాణిజ్య విద్యుత్ వినియోగదారుల పిల్లలు, సంస్థ ఉద్యోగుల పిల్లల కోసం 50 శాతం సీట్లు కేటాయించారన్నారు. ఈ అవకాశాన్ని సంస్థ విద్యుత్ వినియోగదారుల పిల్లలు వినియోగించుకోవాలన్నారు.

లేటరైట్ అనుమతులు రద్దు చేయాలి



లేటరైట్ తరలించే రోడ్డు పరిశీలిస్తున్న సీపీఐ జిల్లా కార్యదర్శి రాముునాయుడు బృందం

-8లో



పరారీలో ఉన్న నిందితులను పట్టుకోండి

- ఎస్పీ తుహిన్‌సిన్హా
- యలమంచిలి సీఐ కార్యాలయం సందర్శన


పెండింగ్ కేసుల గురించి సీఐ ధనుంజయరావుతో మాట్లాడుతున్న ఎస్పీ తుహిన్‌సిన్హా

యలమంచిలి రూరల్ : వివిధ కేసుల్లో న్యాయస్థానాలు నాన్ బెయిలబుల్ వారెంట్‌లు జారీ చేసి, పోలీసులకు చిక్కకుండా తప్పించుకు తిరుగుతున్న నిందితులను పట్టుకుని,న్యాయస్థానాల ఎదుట హాజరుపర్చాలని జిల్లా ఎస్పీ తుహిన్‌సిన్హా ఆదేశించారు. శనివారం ఆయన యలమంచిలి సర్కిల్ కార్యాలయం, రూరల్ పోలీస్ స్టేషన్లను తనిఖీ చేశారు. పెండింగ్‌లో ఉన్న క్రిమినల్ కేసులకు సంబంధించి ఛార్జిషీట్‌లను దాఖలు చేయాలన్నారు. రౌడీషీటర్లు, నేరచరిత్ర, చెడు ప్రవర్తన కలిగిన వ్యక్తులపై ఎప్పటికప్పుడు నిఘా ఉంచాలని సూచించారు. జాతీయ రహదారిపై నిబంధనలకు విరుద్ధంగా వాహనాలను నిలిపి ఉంచకుండా పర్యవేక్షించడంతో పాటు రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. మహిళలు, బాలికల రక్షణకోసం ప్రభుత్వం తీసుకొచ్చిన శక్తి యాప్‌ను ఎక్కువమంది ఉపయోగించేలా చైతన్యం తీసుకురావాలన్నారు. అంతకుముందు తనిఖీకి వచ్చిన ఎస్పీకి పరవాడ డీఎస్పీ విష్ణు స్వరూప్, యలమంచిలి సీఐ ధనుంజయరావు, ఎస్ఐలు సాదరస్వాగతం పలికారు. ట్రైనీ డీఎస్పీ కృష్ణ చైతన్య, యలమంచిలి రూరల్, యలమంచిలి పట్టణం, మునగపాక, యలమంచిలి ట్రాఫిక్ ఎస్ఐలు ఎం. ఉపేంద్ర, కె.సావిత్రి, ప్రసాద్, బి. రామకృష్ణ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఆటో ఢీకొని మహిళకు తీవ్ర గాయాలు


రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మంగ

దేవరాపల్లి: దేవరాపల్లి–కొత్తవలస రోడ్డులో నల్లబిల్లి క్వారీ సమీపంలో శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. దేవరాపల్లి మండలం ముషిడిపల్లి పంచాయతీ శివారు రావాడపాలేనికి చెందిన రావాడ మంగ పశువులను తోలుకుంటూ వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన ఆటో ఆమెను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆమె రెండు కాళ్లు విరిగిపోయాయి. వెంటనే స్థానికులు 108 వాహనానికి సమాచారం అందించారు. తీవ్రంగా గాయపడిన రావాడ మంగను 108 వాహనంలో కె.కోటపాడు ఆస్పత్రికి తరలించారు.

వృద్ధురాలి ఒంటిపై బంగారం లాక్కెళ్లిన ఆగంతకులు

నర్సీపట్నం : నర్సీపట్నం మున్సిపాలిటీ శారదానగర్‌లో ఒంటరిగా నివాసం ఉంటున్న వృద్ధురాలి ఒంటిపై ఉన్న పది తులాల బంగారాన్ని ఆగంతకులు లాక్కుపోయారు. ఎల్‌బీసీ కార్యాలయం వెనక భాగంలో వెంకటలక్ష్మి అనే వృద్ధురాలు ఒంటరిగా నివసిస్తోంది. పిల్లలు ఉద్యోగ రీత్యా వేరే ప్రాంతంలో ఉంటున్నారు. ఈ నెల 16వ తేదీ రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లోకి ప్రవేశించి నిద్రిస్తున్న వృద్ధురాలు మెడలోని తాడు, చేతికి ఉన్న బంగారు గాజులు మొత్తం పది తులాల బంగారు ఆభరణాలను ఆగంతకులు పట్టుకుపోయారు. ఉదయం లేచి వృద్ధురాలు లబోదిబోమనడంతో పోలీసులకు సమాచారం అందించారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ గోవిందరావు తెలిపారు.

‘స్థానికులకు’ ఉపాధి కలేనా..!

- నిర్వాసితులకు దక్కని ఉపాధి అవకాశాలు
- అర్ధంతరంగా మూతపడుతున్న పరిశ్రమలు
- రోడ్డున పడుతున్న కార్మికులు
- భద్రతా ప్రమాణాలు పాటించని పరిశ్రమ యాజమాన్యాలు
- విధుల్లో ఉన్న కార్మికులకు చాలీ చాలని వేతనాలు

సెజ్‌లో భూములు కోల్పోయిన నిర్వాసితులు తమ జీవితాలు బాగుపడతాయన్న ఆలోచనతో వేల ఎకరాలు సెజ్ పరిశ్రమలకు ధారపోశారు. భవిష్యత్తులో తమ పిల్లల జీవితాలకు ఎటువంటి ఆటంకం కలగకుండా సంతోషంగా గడిచిపోతుందని అనుకున్న రైతుల ఆశలు అడియాసలయ్యాయి. స్థానికంగా పరిశ్రమలు వస్తే విద్యార్హతను అనుసరించి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కలుగుతాయనుకున్న నిర్వాసితుల కల కలగానే మిగిలింది. ప్రస్తుతమున్న పరిశ్రమల్లో స్థానికేతరులకు తప్ప స్థానికంగా ఉన్న నిర్వాసిత రైతుల పిల్లలకు ఉద్యోగ,ఉపాధి కల్పనలో పరిశ్రమల యాజమాన్యాలు చొరవ చూపించట్లేదు.


అచ్యుతాపురం ఏపీఐఐసీ ప్రత్యేక ఆర్థిక మండలి ముఖద్వారం


మూతపడ్డ ఫెర్రో ఎల్లాయ్స్ పరిశ్రమ వద్ద ఆందోళన చేపడుతున్న కార్మికులు

- అచ్యుతాపురం, రాంబిల్లి మండలాల్లో 560 ఎకరాల్లో భూమిని సేకరించారు.వీటిలో ఇప్పటివరకూ 208 పరిశ్రమలు ఏర్పాటు చేశారు.
- ఈ రెండు మండలాల్లో 27 గ్రామాలకు చెందిన 5,600 నిర్వాసిత కుటుంబాలను దిబ్బపాలెం, వెదురువాడ ఆర్ అండ్ ఆర్‌కాలనీలకు తరలించారు.
- నిర్వాసితులందరూ కూలీలుగా పనిచేస్తున్నారు.
- ఈ గ్రామాల్లో ఎటువంటి సౌకర్యాలు కల్పించలేదు.
- వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వ హయాంలో 2000 మంది మహిళలకు ఉపాధి కల్పించారు.

అచ్యుతాపురం రూరల్ :

పరిశ్రమలకు గ్రామాల్లో భూములు సేకరించినప్పుడు నిర్వాసితులకు ఆర్.కార్డులు ఇస్తామని, ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ కళాశాలల్లో శిక్షణ ఇచ్చి స్థానిక పరిశ్రమల్లో ఉద్యోగాలు కల్పిస్తామని అప్పటి కలెక్టర్ సమక్షంలో అగ్రిమెంటు చేసుకున్నారు. కానీ నేటికీ అమలు కాలేదని కార్మిక సంఘాల నాయకులంటున్నారు. మత్స్యకార గ్రామాల యువతీ యువకులను పరిశ్రమల్లో ఉద్యోగావకాశాలు కల్పించట్లేదని వాపోతున్నారు. పరిశ్రమల నుంచి వచ్చే వ్యర్థాల కారణంగా మత్స్య సంపద కోల్పోయి, స్థానికంగా ఉన్న పరిశ్రమల్లో అవకాశాలు లేక మత్స్యకార యువకుల జీవనం చాలా దుర్భరంగా మారింది.

వేల సంఖ్యలో ఉద్యోగాలు కల్పిస్తామని నమ్మబలికి రైతుల నుంచి వేలాది ఎకరాలు తీసుకుని నామమాత్రంగా పరిశ్రమలు నెలకొల్పి, రాయితీలు పొందాక కుంటి సాకులతో అర్ధంతరంగా మూసేస్తున్నారు. దీంతో రెక్కాడితే గానీ డొక్కాడని ఎందరో నిరు పేద కార్మికులు రోడ్డున పడుతున్నారు. ఇక నడుస్తున్న పరిశ్రమలూ కార్మికులకు చాలీ చాలని వేతనాలు ఇస్తున్నాయి. ప్రతి 5 సంవత్సరాలకు ఒకసారి కనీస వేతనం పెంచాల్సి ఉన్నప్పటికీ, గత 15 సంవత్సరాలుగా వేతనాలు పెంచలేదని కార్మికులు ఆందోళన చెందుతున్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం ప్రస్తుత ధరలకు అనుగుణంగా కనీసవేతనం రూ.26వేలు ఎక్కడా అమలు కావట్లేదని కార్మికులు వాపోతున్నారు.

స్థానికులకు ఉద్యోగాలివ్వడం లేదు...



భూములు, ఇల్లు కోల్పోయిన నిర్వాసితులకు, స్థానికులకు, మత్స్యకారులకు చట్ట ప్రకారం ఉపాధి కల్పించాలి. ఏయే పరిశ్రమల్లో స్థానికులకు ఎంత మందికి ఉపాధి కల్పించారో పరిశ్రమ బయట బోర్డు పెట్టాలి. పరిశ్రమలోపల ఎటువంటి భద్రతా ప్రమాణాలు పాటించట్లేదు. ప్రతి 6 నెలలకు ఒకసారి సేఫ్టీ ఆడిట్ చేయాల్సి ఉన్నా అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఇప్పటికైనా పరిశ్రమల యాజమాన్యాలు కార్మికుల అభ్యున్నతికి పాటు పడేలా ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలి.

–రొంగలి రాము, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు

పరిశ్రమల కోసం భూములు కోల్పోయాం..



మాది దుప్పితూరు గ్రామం. నేను అచ్యుతాపురం నుంచి విశాఖలో గల ఒక ప్రైవేట్ పరిశ్రమలో పని చేసుకునేందుకు సుమారు 100 కిలో మీటర్ల దూరం రాకపోకలు చేస్తున్నాను. బ్రాండిక్స్ పరిశ్రమలో మా భూములు కోల్పోయాం. కంపెనీ వారు వెయ్యి ఎకరాల స్థలం ఏడాదికి కేవలం వెయ్యి రూపాయలు లీజుకి ప్రభుత్వం నుంచి తీసుకుని, 60 వేల మందికి ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పి నేటికీ కల్పించలేదు. నా లాంటి అర్హత కలిగిన ఎందరో యువకులు సుదూర ప్రాంతాలకు వలస వెళ్లి పనులు చేసుకునే పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం చొరవతో స్థానికులకు 75 శాతం ఉద్యోగాలు కల్పించాలని కోరుతున్నాను.

–మాడెం అజయ్, స్థానిక యువకుడు

మత్స్యకారులకు ఉద్యోగాలివ్వాలి...



పరిశ్రమల వ్యర్థ రసాయనాల కారణంగా సముద్రం కాలుష్యం అవడంతో మత్స్య సంపద కోల్పోతున్నాం. యువకులకు స్థానిక పరిశ్రమల్లో ఉద్యోగావకాశాలు కల్పించకపోవడంతో, అలవాటు లేని యువకులు కొంత మంది జీవనోపాధి కోసం మత్స్య వేటకు వెళ్లి ప్రాణాలు కోల్పోతున్నారు. తల్లిదండ్రులు ఎన్నో ఆశలు పెట్టుకోగా, పిల్లలు స్థిరపడలేకపోవడం వారిని ఎంతో బాధిస్తోంది. ఇప్పటికైనా ప్రభుత్వాలు తగు చర్యలు చేపట్టి మత్స్యకార యువకులకు స్థానిక పరిశ్రమల్లో ఉద్యోగావకాశాలు కల్పించాలని కోరుతున్నాను.

–ఉమ్మిడి జగన్, పూడిమడక మత్స్యకార నాయకుడు

మనస్థాపంతో వివాహిత ఆత్మహత్య


మృతురాలు మాధవి

ఎస్.రాయవరం : గ్రామదేవత పండక్కి తన భర్త అత్తవారింటికి రాలేదని మనస్థాపంతో ధోని మాధవి (25) పుట్టింట్లో ఫ్యానుకు ఉరి బిగించుకుని శనివారం మృతి చెందింది. ఎస్ఐ విభీషణరావు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. కొత్తరేవుపోలవరం గ్రామానికి చెందిన ధోని మాధవికి అదే గ్రామానికి చెందిన నాగార్జునతో 7 నెలల క్రితం వివాహం జరిగింది. ఇటీవల మంగళవారం గ్రామంలో బంగారమ్మతల్లి జాతర జరిగింది. ఆ రోజున భర్త నాగార్జునను ఆహ్వానించగా పండక్కి రాలేదు. అప్పటినుంచి మనస్థాపానికి గురైన మాధవి శనివారం పుట్టింట్లో ఇంటి వద్ద ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు చున్నీతో ఉరి బిగించుకుని మృతి చెందింది. భార్యభర్తల మధ్య ఎటువంటి వివాదాలు లేవని, అన్యోన్యంగా ఉండేవారని కుటుంబ సభ్యులు తెలిపారని చెప్పారు. వివరాల మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలకు పక్కా ఏర్పాట్లు

తుమ్మపాల : ఈ నెల 19 నుంచి జరుగనున్న పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేయాలని, పరీక్షలను పగడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ విజయకృష్ణన్ అధికారులను ఆదేశించారు. పరీక్షల ఏర్పాట్లపై సంబంధిత శాఖల అధికారులతో శనివారం మధ్యాహ్నం వెబెక్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. బందోబస్తు, పరీక్ష కేంద్రాలలో శానిటేషన్, మంచినీరు, మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయాలన్నారు. పరీక్షల సమయంలో కరెంటు కోతలు ఉండకూడదన్నారు. విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకునే విధంగా బస్సులు ఏర్పాటుచేయాలన్నారు. డీఈవో అప్పారావునాయుడు మాట్లాడుతూ ఈ నెల 19 నుంచి 28 వరకు నిర్వహించనున్న పరీక్షలకు 2,481 మంది రెగ్యులర్ విద్యార్థులు, 1,268 మంది ప్రైవేటు విద్యార్థులు హాజరు కానున్నారన్నారు. జిల్లా వ్యాప్తంగా 19 కేంద్రాల్లో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. ఓపెన్ స్కూల్ పదో తరగతి పరీక్షలకు 357 మంది, ఇంటర్ పరీక్షలకు 994 మంది పరీక్ష తప్పిన విద్యార్థులు హాజరుకానున్నారన్నారు. ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు 26 నుంచి 30వరకు జరుగుతాయని తెలిపారు.

అఖిల భారత సమ్మె జూలై 9కి వాయిదా

డాబాగార్డెన్స్(విశాఖ): అఖిల భారత సార్వత్రిక సమ్మె ఈ నెల 20 నుంచి జూలై 9కి వాయిదా పడిందని అఖిల పక్ష కార్మిక సంఘాల నాయకులు తెలిపారు. దేశ సరిహద్దుల్లో ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. జగదాంబ జంక్షన్ సమీపంలోని సిటు కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. కార్మికులను బానిసలుగా మార్చే నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, ప్రభుత్వ రంగ పరిశ్రమల ప్రైవేటీకరణ ఆపాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని తదితర డిమాండ్లతో ఈ సమ్మె చేపట్టనున్నట్లు తెలిపారు. సమ్మె వాయిదా పడిన నేపథ్యంలో.. ఈ నెల 20న పని ప్రదేశాలు, ఫ్యాక్టరీ గేట్ల వద్ద కార్మికులు నిరసనలు తెలియజేయాలని కోరారు. ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి జీవీఎంసీ వరకు జరిగే నిరసన ప్రదర్శనలో పెద్ద ఎత్తున పాల్గొనాలని కార్మికులకు పిలుపునిచ్చారు.

లేటరైట్ అనుమతులు రద్దు చేయాలి


వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకన్న

నాతవరం : లేటరైట్ తవ్వకాల వల్ల గిరిజనులకు అన్ని విధాలుగా నష్టం జరుగుతుందని సీపీఐ జిల్లా కార్యదర్శి మాకిరెడ్డి రామునాయుడు పేర్కొన్నారు. సుందరకోట పంచాయతీ శివారు బమిడికలొద్దు ప్రాంతంలో లేటరైట్ తవ్వకాలు జరిపి లారీలపై తరలిస్తున్న రోడ్డు మార్గాన్ని శనివారం సీపీఐ బృందం సందర్శించారు. కాకినాడ జిల్లా రవతలపూడి మండలం తూళ్లూరు గ్రామ సమీపంలో ఏర్పాటు చేసిన లేటరైట్ మట్టిని నిల్వ చేసే యార్డును పరిశీలించారు. ఈ సందర్భంగా ఒక ప్రకటన విడుదల చేశారు. లేటరైట్ తవ్వకాలను సీపీఐ పూర్తిగా వ్యతిరేకిస్తుందన్నారు. లేటరైట్ ఇతర మైనింగ్ తవ్వకాల కారణంగా చుట్టుపక్కల గిరిజన గ్రామాలు పూర్తిగా నాశనమౌవుతాయన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి లేటరైట్ అనుమతులు రద్దు చేసి తవ్వకాలు నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే ఈ ప్రాంత గిరిజనులతో కలిసి ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా మాజీ కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ, జిల్లా నాయకులు గురుబాబు, క్రాంతి, నాతవరం మండలం సీపీఐ కార్యదర్శి చిన్నయ్యనాయుడు, అప్పారావు, సత్తిబాబు పాల్గొన్నారు.

మైనింగ్ మాఫియాకు అధికారులు దాసోహం

నర్సీపట్నం : లేటరైట్ తవ్వకాల్లో అడుగడుగునా అక్రమాలు జరుగుతున్నాయని, మైనింగ్ మాఫియాకు అధికారులు దాసోహమయ్యారని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.వెంకన్న అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ నాతవరం మండలం, సరుగుడు ప్రాంతంలో లేటరైట్ తవ్వకాల్లో అడుగడుగునా అవినీతి చోటు చేసుకుందన్నారు. విచ్చలవిడిగా లేటరైట్ తవ్వకాలపై మైనింగ్ అధికారుల పర్యవేక్షణ కొరవడిందన్నారు. బమిడికలొద్ది గ్రామంలోని జర్తా లక్ష్మణ్‌రావు పేరున ఉన్న 121 హెక్టార్లలో అనేక అక్రమాలు జరుగుతున్నా అధికారులు కన్నెత్తి చూడలేదన్నారు. లేటరైట్ రవాణా వాహనాల్లో తప్పనిసరిగా జీపీఎస్ పరికరాలు అమర్చాల్సి ఉందన్నారు. సుస్థిర అభివృద్ధి చట్టం (2016) ప్రకారం గనిలో వేంబ్రిడ్జి ఉండాలన్నారు. ఎంఎండీఆర్ చట్టం 1957 సెక్షన్ 21(4) చట్టబద్ధమైన పర్మిట్ లేకుండా మినరల్స్ రవాణా చేయడం నిషేధమన్నారు. లేటరైట్ అక్రమ తవ్వకాలకు సహకరిస్తున్న అధికారులపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

20న సిరివెన్నెల 70వ జయంతి


సిరివెన్నెల 70వ జయంతి పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

అనకాపల్లి (కశింకోట): సినీ రంగంలో రచయితగా ఉత్తమ సాహిత్యాన్ని అందించిన మహోన్నత వ్యక్తిత్వం సిరివెన్నెల సీతారామశాస్త్రిదని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అన్నారు. సిరి వెన్నెల కళా పీఠం ఆధ్వర్యంలో ఈ నెల 20న సాయంత్రం 5 గంటలకు సీతారామశాస్త్రి 70వ జయంతి వేడుకలు అనకాపల్లి సత్య గ్రౌండ్‌లో జరగనున్నాయి. దీన్ని పురస్కరించుకొని శనివారం జనసేన కార్యాలయంలో సిరివెన్నెల 70వ జయంతి పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి సినీ గేయ రచయిత రామజోగయ్యశాస్త్రి హాజరు కానున్నారని ఈ సందర్భంగా ఎమ్మెల్యే తెలిపారు. గవర కార్పొరేషన్ చైర్మన్ సురేంద్ర, నూకాంబిక దేవస్థానం చైర్మన్ పీలా నాగ శ్రీను, అనకాపల్లి బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు రవికుమార్, కొడుకుల శ్రీకాంత్, జోగినాయుడు, చదరం నాగేశ్వరరావు,ఈశ్వర్ పాల్గొన్నారు.

బీసీ ప్రభుత్వ ఉద్యోగ సంక్షేమ సంఘం ఎన్నిక


బీసీ ప్రభుత్వ ఉద్యోగ సంక్షేమ సంఘం సభ్యులను సత్కరిస్తున్న ఉద్యోగులు


అనకాపల్లి టౌన్: బీసీ ప్రభుత్వ ఉద్యోగ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షునిగా కొణతాల గణేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పట్టణంలోని గరల్స్ హైస్కూల్‌లో అసోసియేషన్ ఎన్నికలు శనివారం జరిగాయి. రాష్ట్ర అధ్యక్షుడు గత్తుల వీరభద్రరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శిగా బి.వి.వి.ప్రసాద్, కోశాధికారిగా కె.జోగినాయుడు, అసోసియేషన్ అధ్యక్షునిగా బి.దేముడుబాబు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా పి.జగదీష్, ఆర్.అప్పలరాజు, గౌరవ సలహాదారునిగా రిటైర్డ్ ఎమ్మార్వో పి.వీరభద్రరావు ఎన్నికయ్యారు. అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భూషణరావు, న్యాయ సలహాదారులు పి.రామచంద్రరావు పాల్గొన్నారు.

స్కేట్ బోర్డ్ పార్క్ నిర్మాణానికి అడుగులు

విశాఖ స్పోర్ట్స్: ఆసియన్ స్కేటింగ్ ఛాంపియన్‌షిప్‌ను 2027లో విశాఖ వేదికగా నిర్వహించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. తొలుత ఇక్కడే నేషనల్ స్కేటింగ్ ఛాంపియన్‌షిప్‌ను 2026లో నిర్వహించనున్నారు. స్పీడ్, రోడ్, ఆర్టిస్టిక్, రోలర్ హాకీ, ఇన్‌లైన్ హాకీ తదితర 11 అంశాల్లో ఈ ఛాంపియన్‌షిప్‌లు జరుగుతాయి. బాంకెడ్ ట్రాక్ రింక్‌లో స్పీడ్ పోటీలు జరగనుండగా ఆర్టిస్టిక్ పోటీల్లో విన్యాసాల మేళవింపుతో పోటీలుంటాయి. ఈ పోటీలకు అనువుగా విశాఖలో వసతులున్నా స్కేట్‌బోర్డ్ ఈవెంట్‌కు తగిన వసతులు లేవు. గతంలో వీఎంఆర్‌డీఏ పార్క్‌లోనే చెక్కలతో నిర్మించిన తాత్కాలిక సౌకర్యం కల్పించినా... సిమెంట్‌తో కూడిన నిర్మాణానికి రూపకల్పన జరుగుతుంది. దీనిలో భాగంగానే అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన స్కేట్ బోర్డ్ పార్క్ నిర్మాణానికి ప్రణాళిక చేస్తున్నట్లు వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్, మెట్రోపాలిటన్ కమిషనర్ విశ్వనాథన్, ఎమ్మెల్యే గణబాబు తెలిపారు.

పోలవరం ప్రధాన కాలువ విస్తరణ..
మళ్లీ మొదటికి

- గత ప్రభుత్వంలోనే పూర్తయిన సర్వేలు, గ్రామ సభలు, రైతుల గుర్తింపు, గెజిట్ పబ్లికేషన్
- ఇప్పుడు మళ్లీ రీసర్వే అంటున్న కూటమి ప్రభుత్వం
- నిర్వాసితుల పరిహారంలోనూ రైతుల్లో మొదలైన గందరగోళం



సబ్బవరం: ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పథకం ఈ ప్రాంతాలకు అవసరమైన సాగు, తాగునీరు అందించే బృహత్తర లక్ష్యంతో ప్రారంభించబడింది. ఈ పథకాన్ని ఉత్తరాంధ్రుల జీవనాడిగా చెప్పుకుంటారు. దివంగత నేత, మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖరరెడ్డి సబ్బవరం మండలంలో దీనికి శంకుస్థాపన చేశారు. పోలవరం ఎడమ కాలవను విస్తరించి గోదావరి జలాలను ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పథకం ద్వారా తరలిస్తే ఈ జిల్లాలకు అవసమైన నీరు పుష్కలంగా అందుతుంది. దీంతో ప్రాజెక్టు పూర్తయితే రైతులకు సాగునీరు, పారిశ్రామిక అవసరాలకు జలవనరులు లభ్యమై ప్రాంతీయ అభివృద్ధి జరుగుతుందని, తద్వారా కరువు సమస్య తీరుతుందని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ మేరకు గత ప్రభుత్వంలోనే సర్వేలు, గ్రామ సభలు, రైతుల గుర్తింపు, గెజిట్ పబ్లికేషన్ వంటివి పూర్తయ్యాయి. అయితే కూటమి ప్రభుత్వ హయాంలో రీసర్వే అంటూ అంతా మళ్లీ మొదటికి తీసుకొస్తున్నారు. పరిహారం విషయంలోనూ రైతుల్లో గందరగోళం నెలకొంది.

భూసేకరణ ఇలా..

ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పథకంలో ప్రధాన కాలువ విస్తరణకు సబ్బవరం మండలంలో సుమారు 296.03 ఎకరాల భూమిని సేకరించనున్నారు. మండలంలోని ఆరిపాక, అంతకాపల్లి, అయ్యన్నపాలెం, ఎ. సిరసపల్లి, ఎల్లుప్పి, రాయపుర అగ్రహారం, నల్లరేగులపాలెం, వంగలి, బంగారమ్మపాలెం గ్రామాల్లో సుమారు 700 అడుగుల వెడల్పున ఈ కాలువ విస్తరించనున్నారు. గత ప్రభుత్వంలో ఈ కాలువ విస్తరణకు సంబంధించి అలైన్‌మెంట్ ప్రకారం కాలువకు సేకరించే భూముల్లో సర్వే నిర్వహించడం, గ్రామ సభలు ఏర్పాటు చేయడం, గెజిట్ నోటిఫికేషన్ పేపర్లలో పబ్లిష్ చేయడం వంటి 80 శాతం వరకూ పనులు పూర్తి చేశారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత పోలవరం కాలువ విస్తరణ పనుల అభివృద్ధి నిలిచిపోయింది. ఇప్పటికే పూర్తయిన సర్వేలను పక్కన పెట్టి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మరలా మొదటి నుండి సర్వే నిర్వహించమనడంతో కాలువ విస్తరణకు సంబంధించిన పనులు మరింత ఆలస్యమయ్యే అవకాశం ఉంది. దీంతో ఆయా గ్రామాల్లో కాలువ విస్తరణలో భూములు కోల్పోయే రైతులు తీవ్ర ఆయోమయానికి గురవుతున్నారు.

గ్రామం	భూ సేకరణ (ఎకరాలలో)	పాత ధర సెంట్లలో (రూ)	పాత ధర గజాలలో	పెరిగిన ధర సెంట్లలో	పెరిగిన ధర గజాలలో
ఆరిపాక	70.99	30,000	4,000	32,000	5,000
అంతకాపల్లి	20.52	17,000	2,700	25,000	4,000
అయ్యన్నపాలెం	06.47	18,000	1,300	25,000	2,000
ఎ. సిరసపల్లి	03.21	11,000	600	15,000	2,000
ఎల్లుప్పి	72.06	16,000	1,700	22,000	3,500
రాయపుర అగ్రహారం	26.58	16,500	1,100	25,000	3,000
నల్లరేగులపాలెం	54.36	17,000	1,500	20,000	3,000
వంగలి	39.93	8,500	1.100	18,000	3,500
బంగారమ్మపాలెం	02.91	11,000	1,100	20,000	2,000

పరిహారం విషయంలో అయోమయం..

సబ్బవరం మండలంలోని 9 గ్రామాల్లో ప్రధాన కాలువను విస్తరించనున్నారు. సబ్బవరం విశాఖ నగరానికి అత్యంత సమీపంలో ఉండటంతో పాటు వాణిజ్యపరంగా అనేక విశ్వ విద్యాలయాలు, జాతీయ రహదారులు కలిగి ఉన్న ప్రాంతం. దీంతో ఈ భూములకు ఉన్న ప్రభుత్వ ధర కంటే బహిరంగ మార్కెట్‌లో 5 నుండి 10 రెట్ల వరకూ అధికంగా పలుకుతుంది. ఈ కాలువ విస్తరణలో భూములు కోల్పోయిన రైతులకు గత ప్రభుత్వంలో ఉన్న ప్రభుత్వ ధరకు అదనంగా 1.25 రెట్లు కలిపి ఇవ్వనున్నట్లు గతంలో ప్రకటించింది. అయితే కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత భూముల ప్రభుత్వ ధరలను మరింత పెంచింది. దీంతో ప్రస్తుతం పోలవరం కాలువ విస్తరణలో భూములు కోల్పోతున్న రైతులు తమకు చెల్లించే పరిహారం పాత ధరల ఆధారంగా చెల్లిస్తారో లేక పెరిగిన ధరల ప్రకారం చెల్లిస్తారో అని అయోమయంలో ఉన్నారు. దీనిపై అధికారులు ఇప్పటి వరకూ ఏ విధమైన స్పష్టతా ఇవ్వలేదు.

తీరనున్న సాగు.. తాగునీటి అవసరాలు..

ఈ పథకం ద్వారా శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం, అనకాపల్లి, విశాఖ జిల్లాల్లో సాగు, తాగు నీటి అవసరాలు తీరడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. 8 లక్షల ఎకరాలకు సాగునీరు, 30 లక్షల మందికి తాగునీరు అందనుంది. సుమారు రూ.17,050.20 కోట్ల అంచనా నిధులతో పథకాన్ని చేపట్టగా మొదటి దశలో రూ.2,022.20 కోట్లతోను, రెండో దశలో రూ.15,028 కోట్ల అంచనా నిధులతో పనులు చేపట్టనున్నారు. గోదావరి నదిపై ప్రాజెక్టులు, రిజర్వాయర్లు, కాలువలు నిర్మించి నీటిని సరఫరా చేయనున్నారు. ప్రధాన కాలువను 63.99 కిలోమీటర్ల మేర అభివృద్ధి చేయగా 3.98 లక్షల ఎకరాలకు సాగునీరు అందించడంతో పాటు 30 వేల క్యూసెక్కులను నీటిని తరలించనున్నారు.

మరలా సర్వే నిర్వహిస్తాం..



పోలవరం సుజల స్రవంతి కాలువ విస్తరణకు గతంలో సర్వే చేశాం. అయితే తర్వాత కొన్ని గ్రామాల్లో రీ సర్వే జరగడం, అది జరిగి సంవత్సరం పైనే కావడంతో మరోసారి సర్వే చేయాల్సి ఉంది. సర్వే తర్వాత క్రయ విక్రయాలు జరిగి భూ సేకరణలో భూములు కోల్పోయే రైతులను గుర్తించేందుకు ఆయా గ్రామాల్లో మరలా సర్వే నిర్వహిస్తాం.

–అప్పారావు, డిప్యూటీ తహసీల్దార్, సబ్బవరం మండలం.

క్లుప్తంగా

భగవద్గీత నేర్చుకుందాం



భగవద్గీత శ్లోకాలపై అవగాహన కలిగిస్తున్న గ్రంథాలయాధికారి జగన్నాథం

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు భగవద్గీత శ్లోకాలపై అవగాహన కలిగించారు. వేసవి విజ్ఞాన శిక్షణ తరగతుల్లో భాగంగా శనివారం ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి కె. జగన్నాథం మాట్లాడుతూ భగవద్గీతలోని శ్లోకాలను చదవి భావాన్ని అర్థం చేసుకొని జీవితానికి అన్వయించుకోవాలన్నారు. శిక్షణ కార్యక్రమం వచ్చే నెల 6వ తేదీ వరకు జరగనుందని, దీన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

తీడలో ముగింపు దశకు రీ-సర్వే



తహసీల్దార్ సత్యనారాయణ

కశింకోట: మండలంలోని తీడ గ్రామ పరిధిలో నిర్వహిస్తున్న భూముల రీ-సర్వే ముగింపు దశకు చేరుకుందని తహసీల్దార్ జి. సత్యనారాయణ శనివారం తెలిపారు. గతంలో రీ-సర్వే కాకుండా తీడ, బయ్యవరం గ్రామాలు మిగిలి పోయాయన్నారు. వాటిలో తీడలో ఫిబ్రవరి నుంచి సర్వే నిర్వహిస్తున్నామన్నారు. 317 సర్వే నంబర్లలో 3,117 ఎకరాల భూములున్నాయన్నారు. వాటిలో 700 వరకు ప్రభుత్వ భూమి కాగా, 960 ఎకరాలు అటవీ భూములు ఉన్నాయన్నారు. వీటి క్షేత్ర సర్వే పూర్తి కావడంతో వీఆర్వో లాగిన్‌లో సర్వే వివరాలు నమోదు జరుగుతుందన్నారు. బయ్యవరంలో సర్వే చేయాల్సి ఉందని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చేపడతామన్నారు.

ధ్యాన వేంకటేశ్వరస్వామికి అలంకరణ



కశింకోట: స్థానిక ధ్యాన వేంకటేశ్వర స్వామివారిని వజ్ర కవచాలంకృతులతోపాటు పూలమాలలు, తులసీ మాలలతో శనివారం అందంగా అలంకరించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. వైశాఖ మాసం పురస్కరించుకొని స్వామివారిని అలంకరించి విష్ణు సహస్ర నామార్చన చేశారు. నక్షత్ర హారతి ఇచ్చారు. ఆలయ అర్చకుడు వి. రామచరణాచార్యులు ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.

శివ పార్వతులకు పుష్పాంజలి సేవ



శివ పార్వతులకు నివేదించిన పిండి పదార్థాలు



సర్వమంగళాంబ మూల విగ్రహం అలంకరణ

కశింకోట: స్థానిక సర్వమంగళాంబ సమేత త్రిపురాంతకస్వామి ఆలయం (శివాలయం)లో శనివారం రాత్రి శివ పార్వతుల ఉత్సవ విగ్రహాలకు పుష్పాంజలి సేవ ఘనంగా నిర్వహించారు. ఈ నెల 12న స్వామి అమ్మవార్లకు కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఉత్సవం ముగింపులో భాగంగా పుష్పాంజలి కార్యక్రమాన్ని వేద మంత్రాల నడుమ సంప్రదాయంగా జరిపారు. ఈ సందర్భంగా ఉత్సవ విగ్రహాలు, మూల విరాట్‌లను అందంగా నూతన వస్త్రాలు, ఆభరణాలు, పూలమాలలతో అలంకరించారు. పాలు, వివిధ రకాల పండ్లు, పలు రకాల తీపి, కారం పిండి వంటలు భక్తులు, నిర్వాహకులు తెచ్చి నివేదించారు. పూజలు చేశారు. పాటలు పాడారు. ఆలయ అర్చకులు వి. చిదంబరం, వి. కృష్ణల ఆధ్వర్యంలో నిర్వహించారు.

200 పీఎండీఎస్ కిట్‌ల తయారీ



తయారు చేసిన కిట్స్‌తో ప్రకృతి సిబ్బంది

చీడికాడ : రైతులకు అందించేందుకు 200 పీఎండీఎస్ కిట్‌లను తయారు చేసినట్టు బైలపూడి సర్పంచ్ గంగతల్లి తెలిపారు. శనివారం వారు సచివాలయంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బందితో కూడి 30 రకాల విత్తనాలతో పీఎండీఎస్ కిట్‌లు తయారు చేశారు. ఈ తొలకరిలో వీటిని ఖరీఫ్ సాగుకు ముందు పొలాల్లో చల్లి పచ్చి రొట్ట ఎరువుగా వినియోగించనున్నట్టు తెలిపారు.

సైనికోద్యోగుల కుటుంబాలకు సత్కారం

యలమంచిలి రూరల్: దేశ భూభాగం, ఆస్తులు, ప్రజల రక్షణ అంతా త్రివిధ దళాల్లో పనిచేస్తున్న సైనికోద్యోగుల చేతుల్లోనే ఉందని, వారి సేవలు వెలకట్టలేనివని ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి తెలిపారు. శనివారం యలమంచిలి మున్సిపాలిటీ పరిధిలో నివాసముంటూ రక్షణ దళంలో పనిచేస్తున్న ఉద్యోగుల ఇళ్లకు వెళ్లి వారి కుటుంబ సభ్యులను సత్కరించారు.అంతకుముందు పట్టణ పరిధిలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ ప్రసాదరాజు, అధికారులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం



పాల్గొన్న రెవెన్యూ, జీవీఎంసీ అధికారులు

అనకాపల్లి టౌన్: ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఇన్‌చార్జ్ ఆర్డీవో వై. శ్రీనివాసరావు తెలిపారు. పట్టణంలోని గుండాల జంక్షన్ వద్ద స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ శనివారం ఒక్కో నినాదంతో కార్యక్రమాన్ని నిర్వహించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన పిలుపులో భాగంగా బీట్ ది హీట్ నినాదంతో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా జీవీఎంసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చలివేంద్రంలో ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంచి పెట్టారు. కార్యక్రమంలో జీవీఎంసీ జోనల్ కమిషనర్ బీవీ రమణ, శానటరీ ఎస్ఎస్ ఆర్ రవి కుమార్, డీ భాస్కర్‌రావు, ఎం అప్పారావు, సిహెచ్ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన జముకుల బృంద గానం



జముకుల బృందం ఆలపిస్తున్న అమ్మవారి చరిత్రపై గానం

కశింకోట: స్థానిక గవరపేటలో వెలసిన దేవతమ్మ ఆలయం వద్ద శనివారం జముకుల బృంద గానం ఆహూతులను అలరించింది. దేవతమ్మ ఉత్సవాల్లో భాగంగా మాకవరపాలెం మండలం నాయుడుపాలెంకు చెందిన కల్యాణ పోతురాజుతోపాటు నలుగురు సభ్యుల బృందం జముకులను చేతులతో వినసొంపుగా వాయిస్తూ దేవతమ్మ చరిత్ర పాట ఆలపించారు. ఇది ఆహూతులను ఆకట్టుకుంది. ఈ సందర్భంగా పోతురాజు మాట్లాడుతూ ఏటా జిల్లాలోని పలు గ్రామాల్లో జరిగే పదికిపైగా దేవతమ్మ ఉత్సవాల్లో పాల్గొంటామన్నారు. సంప్రదాయంగా పుట్టుక రోజు మొదలు, పండగ ముగిసే వరకు అమ్మవారి చరిత్ర ఘట్టాలను పాట రూపంలో గానం చేస్తూ ఉత్సవ నిర్వహణలో పాలు పంచుకుంటామన్నారు. ఉత్సవాల రోజుల్లో వచ్చే ఆదాయంతోపాటు సాధారణ రోజుల్లో వ్యవసాయం చేస్తూ, కూలీ పనులకు వెళ్లి కుటుంబ జీవనం సాగిస్తుంటామన్నారు. సుమారు 15 ఏళ్లుగా ఉత్సవాల్లో గానం చేస్తున్నామన్నారు.

ప్రకృతి వ్యవసాయం చేయాలి



ఉత్తమ రైతులను సత్కరిస్తున్న దృశ్యం

కశింకోట: మండలంలోని విసన్నపేటలో ప్రకృతి వ్యవసాయం ఖరీఫ్ ప్రణాళికపై శనివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 30 రకాల నవ ధాన్యాలు సాగు చేయాలని, దానివల్ల భూమి సారవంతమవుతుందని, ఆరోగ్యకరంగా మారుతుందని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది వివరించారు. ప్రతి ఒక్కరూ ప్రకృతి వ్యవసాయం చేయాలన్నారు. దీనివల్ల పెట్టుబడి వ్యయం తగ్గుతుందని, ఆరోగ్యకరమైన ఉత్పత్తులు పండుతాయన్నారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయం చేస్తున్న వారిలో ఉత్తమ రైతులు సత్యారావు, ఆవాల అప్పారావు, మండే వరలక్ష్మి, గొల్లవిల్లి అప్పారావులను ఎంపిక చేసి సత్కరించారు. సర్పంచ్ ఉప్పనూరి మాణిక్యం, వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు ఉప్పనూరి అప్పారావు, కూటమి నాయకులు చిదిరెడ్డి శ్రీనివాసరావు, వీహెచ్‌ఏ చంద్రశేఖర్, ప్రకృతి వ్యవసాయం ప్రతినిధులు సింహాచలం, నాయుడు, ఎస్. అప్పారావు, వెంకటలక్ష్మి, వరలక్ష్మి, మహిళా సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతలో రాజీ వద్దు

సింహాచలం: ప్రసాదాలు, అన్నప్రసాదానికి వినియోగించే సరుకుల నాణ్యతని అధికారులు, స్టోర్స్ సిబ్బంది ఎప్పటికప్పుడు పరిశీలించాలని సింహాచలం దేవస్థానం ఇన్‌చార్జి ఈవో ఎస్.సుజాత సూచించారు. సింహగిరిపై ఉన్న స్టోర్స్‌ని శనివారం ఆమె సందర్శించారు. ముడి సరుకులను పరిశీలించారు. సాంపిల్స్ ఎప్పటికప్పుడు టెస్టింగ్‌కి వెళ్తున్నాయా.. లేదా అని అడిగి తెలుసుకున్నారు. ప్రసాదాల తయారీశాలను పరిశీలించారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



ఎమ్మెల్యే రామకృష్ణకు వినతిపత్రం అందిస్తున్న వార్డు విద్యా కార్యదర్శులు

అనకాపల్లి (కశింకోట): అనకాపల్లి పట్టణంలోని 27 సచివాలయాల్లో తాము ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని వార్డు సచివాలయ కార్యదర్శులు కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణను శనివారం కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. తమకు ప్రధానంగా హెచ్‌వోడీ లేకపోవడం వల్ల అన్ని శాఖల వారు తమపై పెత్తనం చెలాయిస్తూ పని చేయించుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమవి సాంకేతిక పరమైన ఉద్యోగాలు అయినప్పటికి రేషనలైజేషన్ ప్రక్రియలో జనరల్ పర్పస్ కార్యదర్శులుగా గుర్తించారని, తమ పదోన్నతి నాన్ టెక్నికల్ పోస్టు అయిన వార్డు అడ్మినిస్ట్రేటివ్ కార్యదర్శిగా రూపొందించారని, ఇది అన్యాయమని వాపోయారు. తమది టెక్నికల్ పోస్టు అయినందున ఇతర ప్రభుత్వ విభాగాల్లో తమ సేవలను వినియోగించుకోవడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. సీనియర్ అసిస్టెంట్ పదోన్నతులు కల్పించాలన్నారు. పట్టణ వార్డు విద్యా కార్యదర్శులు వి. భాస్కర్, పి. వరప్రసాద్, ఎస్. తారక్ ప్రభు, కె. నాగరాజు, సిహెచ్. నరేష్, గీత, నాయుడు, కోటేశ్వరరావు, భార్గవ్‌ప్రకాష్, శ్రీనివాస్, పద్మారావు, శరత్ చంద్ర, రాజ్‌కమల్ తదితరులు పాల్గొన్నారు.

యోగాసనాలతో వినూత్నంగా నిరసన



యోగాతో నిరసన వ్యక్తం చేస్తున్న సీహెచ్‌వోలు

అనకాపల్లి: కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు శనివారం అనకాపల్లిలో యోగాసనాలతో వినూత్నంగా నిరసన తెలియజేశారు. యోగా మాసంగా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన నేపథ్యంలో యోగాసనాలతో తమ నిరసన వ్యక్తం చేశారు. ఒక పక్క ప్రభుత్వ ఆదేశాల మేరకు యోగాసనాలు వేసి తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా నెహ్రూచౌక్ బీసీఎంసీ మార్కెట్ వద్ద 19 రోజులుగా తమ న్యాయమైన కోర్కెల సాధన కోసం సమ్మె చేస్తున్నప్పటికి ప్రభుత్వం పట్టించుకోలేదని వాపోయారు. ఆయుష్మాన్ భారత్ ద్వారా పల్లెల్లో యోగా, ప్రాణాయామం పట్ల ప్రజలకు అవగాహన కలిగించి, ఆరోగ్యపరమైన పలు సేవలు అందజేస్తున్న సీహెచ్‌వోల సమస్యల గురించి పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. సీహెచ్‌వోలు జి. భవాని, జి. యమున, కె.అశ్విని, టి. కల్యాణి, ఆర్. అప్పలనాయుడు, పి. రాజశేఖర్, సీహెచ్. స్వామి కార్యక్రమంలో పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రతో పరిసరాలు పరిశుభ్రం



బాటజంగాలపాలెంలో ఏర్పాటు చేసిన నీటి తొట్టెను పరిశీలిస్తున్న అనకాపల్లి కలెక్టర్ విజయకృష్ణన్



బాటజంగాలపాలెంలో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్

సబ్బవరం: స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రతో పరిసరాలు పరిశుభ్రం అవుతాయని, ప్రతి ఒక్కరూ ఇల్లు, పరిసర ప్రాంతాల్లో మొక్కలు పెంచడం ద్వారా ఉష్ణోగ్రతలు తగ్గించేందుకు కృషి చేయాలని అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ పిలుపునిచ్చారు. స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా బీట్ ది హీట్ నినాదంతో ప్రయాణికులు, బాటసారుల కోసం ఏర్పాటు చేసిన వేసవి షెల్టర్, చలివేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం వైద్య శిబిరాన్ని పరిశీలించారు. ప్రజలకు కల్పిస్తున్న అవగాహన కార్యక్రమం గురించి, వైద్య సేవల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకోన్నారు. మండలంలో మాతృ మరణాలు ఎక్కువగా ఉన్నాయని, హైరిస్క్ కేసులను నిత్యం పర్యవేక్షించాలని, మాతా శిశు మరణాలు సంభవించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఆనంతరం పశువుల దాహార్తి తీర్చేందుకు ఏర్పాటు చేసిన నీటి కుండీని ప్రారంభించారు. క్యాన్సర్ టెస్టింగ్ సెంటర్‌లో మొక్కలు నాటారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో కె. రాజ్‌కుమార్, మండల ప్రత్యేక అధికారి కె. రమామణి, జిల్లా పంచాయతీ అధికారి ఆర్. శిరీష రాణి, రిసోర్స్ సెంటర్ కో ఆర్డినేటర్ ఈ నాగలక్ష్మి, తహసీల్దార్ బి. చిన్నికృష్ణ, ఎంపీడీవో పద్మజ, మెడికల్ అధికారి డాక్టర్ అశ, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీడీ జె. మణికుమార్, సర్పంచ్ పడాల వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు శనివారం 455 దిమ్మలు వచ్చాయి..

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,100	4,900
రెండో రకం	3,880	4,310
మూడో రకం	3,350	3,670

అనకాపల్లి సినిమాలు

లెవన్	:రాజా
అర్జున్ సన్ఆఫ్ వైజయంతి	:సత్యనారాయణస్క్రీన్-1
లవ్లీ	: సత్యనారాయణ స్క్రీన్-2
హిట్-3	:పరిసాయి
సింగల్	:షిర్డీసాయి
మన కుటుంబం	:వెంకటేశ్వర
అర్జున్ సన్ ఆఫ్ వైజయంతి	:శ్రీసత్య
ఫైనల్ డెస్టినేషన్ బ్లడ్‌లైన్స్	:రామచంద్ర

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శనివారం 357 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 304 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి 08924-223595 నంబరు సంప్రదించవచ్చు.

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 52 యూనిట్లు రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-17 యూనిట్లు, బీ పాజిటివ్-14, ఓ పాజిటివ్-18, ఏబీ పాజిటివ్-3 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యూ లోకేష్‌ను (9703619706) సంప్రదించవచ్చు.